అర్హులెవరు?అనర్హులెవరు..?

నర్కూడ గ్రామంలో తమకు ఎందుకు ఇండ్లు ఇవ్వడంలేదని అధికారులను నిలదీస్తున్న బాధితుడు , పెద్దషాపూర్ గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో మున్ని, తదితరులు

- గందరగోళంగా గ్రామసభలు
- అనర్హులకు రేషన్‌కార్డులు, ఇండ్లు కేటాయింపు
- అధికారులను నిలదీసిన ప్రజలు

శంషాబాద్ రూరల్, జనవరి 24 : సంక్షేమ పథకాల ఎంపిక కోసం నిర్వహిస్తున్న గ్రామసభలు శుక్రవారం గందరగోళంగా ముగిశాయి. శంషాబాద్ మండలంలోని నర్కూడ, మల్కారం, పెద్దషాపూర్, పాలమాకుల, పెద్దతూప్ర గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో అడుగడుగున ప్రజలు అధికారులను నిలదీశారు.

- నర్కూడ, పెద్దషాపూర్, పాలమాకుల గ్రామాలలో నిర్వహించిన సభలలో సంక్షేమ పథకాలు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు అనర్హులకు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.
- పెద్దషాపూర్ గ్రామంలో నిర్వహించిన సభలో ఎంపీడీవో మున్ని పాల్గొని సంక్షేమ పథకాల అబ్ధిదారుల లిస్టును అధికారులతో ప్రజలకు వివరించారు.
- అదే సమయంలో తమకు రేషన్‌కార్డు, ఇండ్లు ఎందుకు ఇవ్వరని పలువురు నిలదీశారు. దీంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామసభల పేరుతో ప్రజలను తప్పదోవపట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తి స్థాయిలో కేవలం పేదలకు మాత్రమే పథకాలు ఇవ్వాలని పలువురు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు గౌస్‌పాషాతో పాటు పలువురు ప్రజలు పాల్గొన్నారు.
- నర్కూడ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఎంపీవో ఉషకిరణ్ పాల్గొని రేషన్‌కార్డుల అర్హుల లిస్టు, ఇందిరమ్మ ఇండ్ల లిస్టు పంచాయతీ కార్యదర్శి చదివి వినిపించారు. దీంతో ఒక్కసారిగా అర్హులకు కాకుండా అనర్హులకు కేటాయించాలని పలువురు అధికారులను నిలదీశారు.
- బీఆర్ఎస్ నాయకుడు బుర్కుంట సతీష్ నర్కూడ గ్రామంలో అనర్హులకు సంక్షేమ పథకాలు వర్తిస్తే ఎలా... కేవలం పేదలకు మాత్రమే సంక్షేమ పథకాలు అందించే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు.
- అనర్హులకు కేటాయిస్తే అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్దులు, మాజీ ఉప సర్పంచ్ శేఖర్‌యాదవ్, నాయకులు కుమార్‌యాదవ్, తోంట అశోక్, కిట్టులతో పాటు పలువురు నాయకులు ప్రజలు పాల్గొన్నారు.
- పాలమాకుల, పెద్దతూప్ర గ్రామాల్లో అర్హులకు మాత్రమే కేటాయించాలని ప్రజలు అధికారులను డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ నాయకులు హౌస్ అరెస్టు

బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మోహన్‌రావును హౌస్ అరెస్టు చేస్తున్న పోలీసులు

శంషాబాద్ రూరల్, జనవరి 24 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఖండిస్తూ ప్రజాభవన్ ముట్టడికి పిలుపు నిచ్చిన విషయం తెలిసిందే. దీంతో శంషాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు మంచర్ల మోహన్‌రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులను శుక్రవారం హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు మోహన్‌రావు మాట్లాడుతూ తెలంగాణలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి వాటిని అమలు చేయడంతో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఏడాది దాటినా ఒక్క హామీని అమలు చేయలేదని ఎద్దేవా చేశారు.

రేపు భారత రాజ్యాంగంపై జాతీయ సదస్సు

జూబ్లీహిల్స్,జనవరి 24 : గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 26 న హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్‌పీఆర్ హిల్స్‌లోని సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ వేదికగా 'భారత రాజ్యాంగం- 75 ఏండ్ల ప్రయాణం' అనే అంశంపై జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు సీడీఎస్ చైర్మన్ మల్లేపల్లి లక్ష్మయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోసా లక్సంబర్గ్ స్టిఫ్టంగ్-దక్షిణాసియా, ఇతర సంస్థలతో కలిసి 'భారత రాజ్యాంగం-సామాజిక ఆర్థిక న్యాయం'.. 'భారత రాజ్యాంగం-మహిళల హక్కులు'.. 'ప్రాతినిధ్యంలో తగ్గిపోయిన వర్గాలు-మైనార్టీల హక్కులు' అనే మూడు ప్రధానమైన అంశాలపై విస్తృతస్థాయి చర్చలు జరుపనున్నట్లు తెలిపారు. ముఖ్య వక్తలుగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, యూజీసీ అండ్ ఐసీఎస్ఎస్ఆర్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ సుఖదేవ్ రాథోడ్, పౌర హక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్, మాజీ ఐఏఎస్ కె.రాజు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఎంవీ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ప్రొఫెసర్ శాంతా సిన్హా ప్రసంగిస్తారని తెలిపారు.

నైపుణ్య వికాసంతోనే ఉజ్వల భవిష్యత్

నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న శరత్ చంద్ర సిన్హా

హిమాయత్‌నగర్,జనవరి 24: పోటీ ప్రపంచంలో విద్యార్థులు నైపుణ్య వికాసం పెంచుకొని ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని పలువురు వక్తలు సూచించారు. శుక్రవారం నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో నైపుణ్య వికాసంపై అవగాహన సదస్సు జరిగింది.ఈ సందర్భంగా కేఎల్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శరత్ చంద్ర సిన్హా, బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాపోలు శ్రీనివాస్ మాట్లాడారు. చదువుకునే సమయంలో ఉపాధి అవకాశాలు అందుకునేలా నైపుణ్యాలను పెంచి స్కిల్స్, కెరీర్ డెవలప్‌మెంట్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో అధ్యాపకులు హెచ్.నర్సింలు, డాక్టర్ సూర్య ప్రవీణ్‌కుమార్,డాక్టర్ కడారి శ్రీనివాస్‌రావు,డాక్టర్ జె.గంగాధర్, ప్రదీప్‌కుమార్, హెచ్ శ్రీనివాసరావు,చంద్రకళ పాల్గొన్నారు.

ఐడీబీఐ బ్యాంకు చేయూత

పాఠశాల ఉపాధ్యాయులకు ప్రింటర్లు,కంప్యూటర్లను అందజేస్తున్న ఐడీబీఐ బ్యాంకు అధికారులు

మణికొండ, జనవరి 24 : సర్కారు బడులను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దడంతో స్వచ్ఛంద సంస్థల చేయూత ఆదర్శనీయమని మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థుల కోసం ఐడీబీఐ బ్యాంకు యాజమాన్యం సీఎస్ఆర్ నిధుల నుంచి ప్రింటర్, కంప్యూటర్లను పాఠశాలలకు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ప్రాంతీయ కో-ఆర్డినేటర్ అధికారులు విశ్వనాథ్ ప్రభు, బ్యాంకు మేనేజర్ వీరరాజు, అధికారులు అఖిలేష్, జై సింగ్,కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, నాయకులు శ్రీరాములు, బీరప్ప, శ్రావణ్, రవి కాంత్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు

జూబ్లీహిల్స్,జనవరి 24: వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం డివిజన్‌లోని వెజిటెబుల్ మార్కెట్ నుంచి అమర్‌పాయింట్ లేన్ వరకు చేపడుతున్న వాటర్ పైప్ లైన్ పనులను పరిశీలించారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

స్వదేశీ మేళాకు ఆహ్వానం

హిమాయత్‌నగర్,జనవరి 24: భారత సంస్కృతిని ప్రతిబింబిస్తూ వివిధ రంగాలకు చెందిన స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు త్వరలో కరీంనగర్‌లో నిర్వహించే స్వదేశీ మేళాకు హాజరుకావాలని కోరుతూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను స్వదేశీ జాగరణ మంచ్ ప్రతినిధి బృందం ఆహ్వానించింది. శుక్రవారం రాజ్ భవన్‌లో బృందం సభ్యులు జిష్ణుదేవ్ వర్మను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. గవర్నర్‌ను కలిసిన వారిలో అఖిల భారత సహ సంఘటన నేత సతీష్,స్వదేశీ జాగరణ మంచ్ నాయకుడు హరీష్‌బాబు, స్వావలంభి భారత్ అభియాన్ ప్రాంత్ర కో-కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, స్వదేశీ జాగరణ మంచ్ ప్రాంత్ర ప్రచార ప్రముఖ్ కేశవ్ సోని,సభ్యులు సుధాకర్ శర్మ,మహేష్ ఉన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు

బోరబండ చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఎర్రగడ్డ, జనవరి 24: ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం బోరబండలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ ఎస్సై ఖాజామియా ఆధ్వర్యంలో సిబ్బంది స్థానిక బస్ టెర్మినల్ చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులను అడ్డుకుని తనిఖీలు చేయగా, చాలా మంది వద్ద డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు లేకుండానే వాహనాలు నడుపుతున్నట్లు తేలింది. రద్దీగా ఉండే బోరబండ బస్ టెర్మినల్ చౌరస్తా వద్ద చాలా వాహనాలు రాంగ్ రూట్లో వెళ్తుండటంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతుంటాయని.. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఇక్కడ ఉదయం నుంచి రాత్రి వరకు ఇద్దరు సిబ్బందిని ట్రాఫిక్ విధులకు కేటాయించామని ఎస్సై పేర్కొన్నారు. ఇక నుంచి తరచూ ఈ విధంగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తామన్నారు.

ఎంజీఐటీ కళాశాలలో విద్యార్థులు, సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది

అగ్ని ప్రమాదాలపై అవగాహన

మణికొండ, జనవరి 24 : అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఆకస్మికంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలను అరికట్టే విధానంపై శుక్రవారం గండిపేటలోని మహాత్మాగాంధీ ఇన్‌స్ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాల(ఎంజీఐటీ)లో అవగాహన కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్, ఫైర్ సర్వీస్‌శాఖ సంయుక్తంగా నిర్వహించారు. విద్యార్థులు, నాన్‌టీచింగ్ సిబ్బందికి ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. ప్రమాదవశాత్తు గ్యాస్ లీకైతే విద్యుత్ వైర్లలో ఫైర్ వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.చంద్రమోహన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి డా.జి.బాల్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ బర్నాబోస్, అగ్నిమాపకశాఖ అధికారులు బాలకృష్ణ, రవీందర్, రాజు, ఫణికుమార్, చంద్రశేఖర్, వెంకటయ్య,సిబ్బంది శశిధర్, వర్మ, సుధ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడితే చట్టపరమైన చర్యలు

నార్సింగి మున్సిపల్ శానిటేషన్ సూపర్‌వైజర్ లచ్చిరాం

45 కిలోల ప్లాస్టిక్ పట్టివేత..రూ.5వేల జరిమానా

కోకాపేటలోని చికెన్ దుకాణంలో ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని జరిమానా విధిస్తున్న శానిటేషన్ అధికారులు, బృంద సభ్యులు

మణికొండ,జనవరి 24 : అక్రమంగా ప్లాస్టిక్ విక్రయాలు చేస్తే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని నార్సింగి మున్సిపాలిటీ శానిటరీ సూపర్‌వైజర్ లచ్చిరాం అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట, మంచిరేవులలో ఆయన పలు కిరాణ దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 45 కేజీల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని రూ.5వేల జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్‌ను నిషేధించి దాదాపు ఐదు సంవత్సరాలు గడుస్తుందని అయినా కొంతమంది గుట్టుచప్పుడు కాకుండా ప్లాస్టిక్‌ను విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ క్రమంలో భాగంగా ఆయా ప్రాంతాల సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలు చేశామన్నారు. కిరాణ దుకాణాలు, పువ్వుల వ్యాపారులు, వైన్‌షాపులు, చిన్నచిన్న వ్యాపార కేంద్రాల్లో ప్లాస్టిక్ వాడకం వాడవద్దంటూ అనేకమార్లు అవగాహన సదస్సులను సైతం నిర్వహించామన్నారు. మొండిగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోకాపేట, మంచిరేవుల వార్డుల సూపర్‌వైజర్లు వంశీ,మహిపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు

నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ముగ్గుల పోటీలకు అనూహ్య స్పందన లభించింది. వృద్ధులు,మహిళలు, యువతులు, ముత్యమంత ముగ్గులతో మురిపించారు.ముగ్గుల పోటీల్లో విజేతలు, ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి,వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ మధుసూదన్,మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు వనం దుర్గం తల,రాష్ట్ర అధ్యక్షురాలు గుంటక రూపాసదాశివ్,నగర అధ్యక్షురాలు పోరండ్ల శారద, తదితరులు పాల్గొన్నారు.
- హిమాయత్‌నగర్

అకౌంట్లకు జీతాలు.. రియల్ వ్యాపారంలో బిజీబిజీ

విధులకు హాజరుకాని ఉపాధ్యాయుడు

ఆర్జేడీఎస్ఈ విజయలక్ష్మికి వినతి పత్రాన్ని అందజేస్తున్న నరేందర్‌గౌడ్

హిమాయత్‌నగర్,జనవరి 24:విధులకు హాజరుకాకుండా జీతాలు తీసుకుంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్జేడీఎస్ఈ విజయలక్ష్మికి శుక్రవారం తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం వినతి పత్రాన్ని అందజేసింది.ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. యాద్రాది జిల్లా, రామన్నపేట మండలంలోని తుర్కపల్లి ప్రాథమిక స్కూల్ ఉపాధ్యాయుడు ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి బినామి టీచర్‌ను నియమించుకుని నెలలో రెండుసార్లు మాత్రమే హాజరవుతున్నారని తెలిపారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి హైదరాబాద్ నగరంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడని ఆరోపించారు. తక్షణమే అతనిపై చర్యలు తీసుకొని మరో ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆర్జేడీఎస్ఈ విజయలక్ష్మి స్పందించి విచారణ చేసి అతనిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర శ్రీహరిగౌడ్, రాష్ట్ర కార్యదర్శి భిక్షపతిగౌడ్ పాల్గొన్నారు.

460 మంది గాయకులతో..'నూరేండ్ల నా ఊరు'

28న రవీంద్రభారతిలో గాయనీ, గాయకుల ఎంపిక ప్రముఖ కవి, సినీ గేయ రచయిత, వరంగల్ శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ శ్రీనివాస్

ఖైరతాబాద్, జనవరి 24 : చారిత్రత్మాకంగా 243 చరణాలతో రచించిన 'నూరేండ్ల నా ఊరు' గేయ కావ్యం ఆలాపన కోసం ఈ నెల 28న రవీంద్రభారతిలో గాయనీ, గాయకుల ఎంపిక జరుగుతుందని ప్రముఖ కవి, సినీ గేయ రచయిత, వరంగల్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ వాతావరణం, జీవితంపై సుమారు 25 ఏండ్ల పరిశోధన చేసి దానిని గేయ కావ్యంగా రూపొందించినట్లు తెలిపారు. నాలుగు గంటల నిడివి కలిగిన ఈ గేయ కావ్యాన్ని 72 మంది గాయనీలు, 171 మంది గాయకులు, ఇతర కోరస్ బృందం కలిపి మొత్తం 460 మంది ఆలపిస్తారన్నారు. 220 మంది నృత్యకారులు పాలుపంచుకుంటారని తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో వరంగల్ శ్రీనివాస్ రచించిన, ఆలపించ గేయాలు ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపాయన్నారు. గ్రూప్-2 పరీక్షల్లో నూరేండ్ల నా ఊరు గేయ కావ్యం రచయిత ఎవరనే ప్రశ్న సైతం రావడం గొప్ప విషయమన్నారు. ఒకే వేదికపై 460 మంది గాయనీ, గాయకులు నాలుగు గంటల పాటు గేయ కావ్యాన్ని ఆలపించడం ప్రపంచంలో ఎక్కడా జరుగలేదని, ఇది కచ్చితంగా గిన్నీస్ బుక్ రికార్డ్స్‌లో ఎక్కుతుందన్నారు. ఈ సమావేశంలో ప్రజా గాయకుడు దరువు అంజన్న, వేణు, మల్లిక్ తేజా, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 24: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ ఆడియాలజీ, ఎమ్మెస్సీ స్పీచ్ లాంగ్వేజ్ ప్యాథాలజీ కోర్సుల మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈనెల 28వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో వచ్చే నెల 3వరకు చెల్లించవచ్చన్నారు.

వస్తున్నాం..పోతున్నాం

- సర్వర్ నైఆరా.. కల్ ఆవో...
- ప్రజాపాలనలో కనిపించని స్పష్టత
- ఇబ్బందుల్లో లబ్ధిదారులు

సులేమాన్ నగర్ వార్డు కార్యాలయం వద్ద అధికారుల కోసం ఎదురుచూస్తున్న ప్రజలు

వ్యవసాయ యూనివర్సిటీ, జనవరి 24: ప్రజాపాలనలో ఎలాంటి స్పష్టత లేకుండా పోయింది. సంబంధిత అధికారులు సైతం లేకుండా, కిందిస్థాయి సిబ్బందిని ఒకరిద్దరిని అందుబాటులో ఉంచారు. వారు అక్కడికి వచ్చిన లబ్ధిదారులకు ఏదో ఒకటి, స్పష్టత లేని సమాచారం ఇచ్చి పంపించడం పరిపాటిగా మారింది. శుక్రవారం రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని సులేమాన్ నగర్ డివిజన్ -57 వద్ద పలువురు గంటల తరబడి కూర్చుననారు. రోజూ ఏదో ఒకటి చెప్పి పంపింస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యాలయం వద్ద పూర్తి స్థాయి సిబ్బంది లేకుండా అటెండర్, కంపూటర్ ఆపరేటర్,ఇందిరమ్మ ఇండ్ల విభాగం వీసీ సెక్షన్ సీఓ రేణుక మాత్రమే ఉన్నారు. సర్వర్ సనిచేయడం లేదు..గణతంత్ర దినోత్సవం తరువాత రావాలని సూచిస్తున్నారు. కొందరు దరఖాస్తులు చేసుకుని కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. లబ్ధిదారుల జాబితా ఇంకా తయారు చేస్తున్నారని, జండా(జనవరి 26)తర్వాతే స్పష్టత వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

అంతా ఉత్త మాటలే...

మూడు రోజుల నుంచి వస్తున్నాం , ఎవ్వరూ ఆఫీసర్లు ఉండడం లేదు , గంటల తరబడి ఇక్కడ ఉండాల్సి వస్తోంది.కొందరు పైరవీ కారులను ఆశ్రయిస్తున్నారు. మాకు ఇల్లు లేదు. ఇస్తారేమోనని ఆశ . గణతంత్ర దినోత్సవం తర్వాత రమ్మంటున్నారు.
- నుర్జానా బేగం , గృహిణి, సులేమాన్ నగర్

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

బాబుల్‌రెడ్డినగర్‌లో బోరు పనులను పరిశీలిస్తున్న నవ యువ యూత్ క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 24: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నీటి సమస్యను పరిష్కరించేందుకు నవయువ యూత్ క్లబ్ ఎంతో కృషి చేసిందని బాబుల్‌రెడ్డినగర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.అనిత పేర్కొన్నారు. పాఠశాలలో బోరు నీటి సమస్యను క్లబ్ దృష్టికి తేవడంతో వారు స్థానిక నాయకులు సంతోష్‌గౌడ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డిల సహకారంతో ఈ సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం చూపించారన్నారు. రెండు సంవత్సరాలుగా విద్యార్థులు నీటి సమస్యతో ఇబ్బంది పడటంతో వారు చొరవ తీసుకొని అవసరమైన సహాయాన్ని అందించడం గొప్పవిషయమన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన బోరు మాత్రమే కాకుండా కమ్యూనిటీహాల్ దగ్గర ఉన్న బోరును కూడా అందుబాటులోకి తెచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి, కిషన్‌నాయక్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

వికాస్‌సింగ్ (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 24: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి కనిపించకుండాపోయిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాటేదాన్ ప్రాంతంలో వికాస్‌సింగ్(25) తన కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 18న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకాబు చేసినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. ఈ మేరకు మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వ్యక్తి వివరాలు ఎవరికైనా తెలిస్తే ఫోన్ నెంబర్ 9490617459లో సంప్రదించాలని కోరారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 24: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ (పీసీఐ) ఎనిమిదో సెమిస్టర్ మేకప్, బీసీఏ ఆరో సెమిస్టర్ మేకప్ పరీక్ష ఫలితాలను విడుదల చేశామని చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ మెయిన్, ఇతర సెమిస్టర్ బ్యాక్‌లాగ్, సప్లమెంటరీ పరీక్షలను ఈనెల 28వ తేదీ నుంచి, ఎంఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 22వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.